సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం ¦ 28 ¦ జూలై ¦ 2023



వైద్యులకు నియామకపత్రాలు

సింగరేణి పరిధిలోని ఆస్పత్రుల్లో వైద్యులుగా ఎంపికైన వారికి జీఎం కె.బసవయ్య నియామక పత్రాలు అందజేశారు. 8లో



జల దిగ్బంధంలో గుండాల

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గుండాల, ఆళ్లపల్లి మండలాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
28° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు ఓ మోస్తరు వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ప్రజల సమస్యలపై సత్వరమే స్పందించాలి: ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి



కిన్నెరసాని జలాశయాన్ని పరిశీలిస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీ డాక్టర్ వినీత్

పాల్వంచ/పాల్వంచ రూరల్: పోలీస్‌స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే వారి సమస్యలపై సత్వరమే స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ఎస్పీ వినీత్‌తో కలిసి గురువారం ఆయన పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆవరణలో పరిశీలించి కేసులు, దర్యాప్తు వివరాలను ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారితో మర్యాదగా ప్రవర్తించాలని, కేసులు పెండింగ్‌లో ఉండకుండా దర్యాప్తు వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. ఆ తర్వాత ఐజీ, ఎస్పీ కిన్నెరసాని ప్రాజెక్టును పరిశీలించి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోపై అధికారులతో చర్చించారు. ప్రాజెక్టును చూసేందుకు ఎవరూ రాకుండా అడ్డుకట్టవేసి ప్రమాదాలను నివారించాలని పోలీసులకు సూచించారు. డీఎస్పీ వెంకటేశ్, సీఐ వినయ్‌కుమార్, ఎస్‌ఐలు నరేశ్, రాము, రాఘవయ్య పాల్గొన్నారు.

పలు ఆర్టీసీ సర్వీసులు రద్దు

రీజియన్‌కు రూ.35లక్షల నష్టం

ఖమ్మం మామిళ్లగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ఆర్టీసీకి తీవ్ర నష్టం ఎదురైంది. పలుచోట్ల రహదారులపైకి వరద చేరడంతో రాకపోకలు నిలిపివేయగా ఆర్టీసీ అధికారులు గురువారం బస్సు సర్వీసులు రద్దుచేశారు. దీంతో ప్రతిరోజు రావాల్సిన రూ.95లక్షల ఆదాయానికి గాను రూ.60 లక్షలే రాగా, రూ.35 లక్షల నష్టం ఎదురైంది. ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోల పరిధిలో మొత్తం 135 సర్వీసులను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కొత్తగూడెం డిపో నుంచి 20, సత్తుపల్లి డిపో నుంచి 8, మణుగూరు డిపో నుంచి 29, మధిర డిపో నుంచి 12, భద్రాచలం డిపో నుంచి 45 బస్సులతో పాటు ఖమ్మం డిపో ద్వారా నడిచే 21 సర్వీసులు రద్దు చేశారు.

40 మంది విద్యార్థులను రక్షించిన సీఐ



బాధిత విద్యార్థులతో సీఐ రమేష్

మణుగూరు రూరల్ : జలదిగ్బంధంలో చిక్కుకున్న 40 మంది విద్యార్థులను మణుగూరు సీఐ ముత్యం రమేష్ రక్షించారు. భారీ వర్షాలతో అశోక్‌నగర్‌లోని బాలుర వసతి గృహం గురువారం వరదనీటితో నిండింది. విషయం తెలుసుకున్న సీఐ సిబ్బందితో హాస్టల్‌కు చేరుకుని తాడు సాయంతో వసతిగృహంలోకి వెళ్లి ఒక్కో విద్యార్థిని తాడు ద్వారా బయటకు తీసుకొచ్చారు. 40 మంది విద్యార్థులను కాపాడిన సీఐ రమేష్‌ను పలువురు అభినందించారు.

జాగ్రత్తలు పాటించాలి

భద్రాచలంఅర్బన్ : వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌ఓ శిరీష అన్నారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో గర్భిణులతో మాట్లాడారు. ఆ తర్వాత నన్నపనేని స్కూల్, జూనియర్, డిగ్రీ కాలేజీలు, సీతా నిలయం, ఎంపీ బంజర పీహెచ్‌సీ పరిధిలోని నాగినేనిప్రోలు, రెడ్డిపాలెం రీహాబిటేషన్ కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. వైద్య సిబ్బంది సెలవులు తీసుకోకుండా విధులకు హాజరు కావాలని, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాజ్‌కుమార్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, చైతన్య పాల్గొన్నారు.

వణికిస్తున్న వరద



భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

భద్రాచలం వద్ద తగ్గి.. పెరుగుతున్న గోదావరి

- అప్రమత్తంగా ఉంటున్న అధికారులు
- పునరావాస శిబిరాలకు లోతట్టు ప్రజలు
- ఎగువన వర్షాలతో నీటిమట్టం మళ్లీ పెరిగే అవకాశం
- 55 అడుగులకు తగ్గట్టుగా ఏర్పాట్లు

భద్రాచలం: తగ్గుతూ..పెరుగుతూ వస్తున్న గోదావరిని చూసి తీరప్రాంత ప్రజలు గజగజ వణుకుతున్నారు. కంటి మీద కునుకు లేకుండా జాగారం చేస్తున్నారు. అధికారులు సైతం లోతట్టు ప్రాంత ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. గురువారం ఉదయం పెరిగిన గోదావరి సాయంత్రానికి తగ్గింది. కానీ భారీ వర్షాలకు నిండిన ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండటంతో శుక్రవారం సైతం ఏజెన్సీకి గోదావరి ప్రమాదం పొంచి ఉంటుందని అధికారుల అంచనా. బుధవారం రాత్రి రెండో ప్రమాద హెచ్చరిక 48 అడుగులను దాటి ప్రవహించగా గురువారం ఉదయం 5 గంటలకు 50.20 అడుగులు, 8గంటలకు 50.50 అడుగులతో 12,86,136 క్యూసెక్కుల నీరు ప్రవహించింది. అనంతరం తగ్గుముఖం పట్టి మధ్యాహ్నం 12 గంటలకు 50, 2 గంటలకు 49.40, సాయంత్రం 5 గంటలకు 48.40, రాత్రి 11 గంటలకు 46.40 అడుగులుగా నమోదైంది. ప్రస్తుతానికి మొదటి ప్రమాద హెచ్చరిక పైనే గోదావరి ప్రవహిస్తోంది.

మళ్లీ పెరిగే అవకాశం..

గోదావరి వరద కొద్దిగా తగ్గుముఖం పట్టినప్పటికీ ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో మళ్లీ పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కడెం ప్రాజెక్టు, సమ్మక్క సారక్క బ్యారేజీ నుంచి సుమారు 7 లక్షల క్యూసెక్కుల నీరు భద్రాచలం చేరుకుంటుందని, తాలిపేరు వరద తగ్గినా కిన్నెరసాని, శబరి పోటెత్తితే మళ్లీ గోదావరి నీటిమట్టం పెరుగుతుందని అధికారులు అంటున్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు శిబిరాలకు తరలింపు: రెండవ ప్రమాద హెచ్చరికను దాటడంతో భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, అశ్వాపురం, మణుగూరు, పినపాక, గుండాల, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో ముంపు ప్రాంత ప్రజలను ముందస్తుగా పునరావాస శిబిరాలకు తరలించారు. ఈ మండలాల్లో 1211 కుటుంబాలకు చెందిన 3296 మందిని 42 పునరావాస శిబిరాలకు తరలించారు. ముందస్తుగా ప్రమాదం పొంచి ఉన్న గ్రామాలు, కాలనీలకు చెందిన వారిని తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రత్యేకాధికారుల సలహాలు, సూచనల మేరకు డివిజన్, మండల స్థాయి అధికారులు ముంపు ప్రాంతాల వద్ద నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. 55 నుంచి 58 అడుగుల వరకు గోదావరి వస్తే తీసుకోవాల్సిన ఏర్పాట్లు, జాగ్రత్తలను ముందుస్తుగానే అధికారులు సిద్ధం చేస్తున్నారు.

కంట్రోల్ రూంల ఏర్పాటు..

మరో రెండు రోజులు గోదావరి వరద ఇలాగే ప్రవహించే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రియాంక అల సూచించారు. అత్యవసర సేవలు అవసరమైతే కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం 08744-241950, 9392919743 వాట్సాప్ నంబర్‌కు, కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో 9392919750, భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో 08743-232444, వాట్సాప్ నంబర్ 7981219425కు మెసేజ్ లేదా వీడియో పంపాలని సూచించారు.

ఉరుకులు.. పరుగులు..

- భద్రాద్రికి మళ్లీ మంత్రి పువ్వాడ
- ఇక్కడే మకాం వేసిన కలెక్టర్, ఎస్పీ
- వరద పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్ష

భద్రాచలం : భద్రాచలం ఏజెన్సీలో గోదావరి వరద అధికారులను, ప్రజాప్రతినిధులను ఉరుకులు పరుగులు పెట్టిస్తోంది. ఈనెల 21న మొదటి ప్రమాద హెచ్చరిక దాటి 43.5 అడుగులుగా నమోదు కావడంతో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ భద్రాచలం వచ్చి గోదావరి, బ్రిడ్జి, కరకట్ట ప్రాంతాలను సందర్శించడంతో పాటు అధికారులతో సమీక్ష నిర్వహించారు. మరుసటి రోజు సైతం సారపాక ఐటీసీలో ఉండి అధికారులతో చర్చించారు. ఇక బుధవారం మళ్లీ మొదటి, రెండో ప్రమాద హెచ్చరికలను దాటి గోదావరి ప్రవహించటంతో మంత్రి మరోసారి భద్రాచలం వచ్చారు. ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో కలెక్టర్, ఎస్పీ, ప్రత్యేకాధికారులతో సమీక్ష నిర్వహించి, లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

అత్యవసరమైతేనే బయటకు రావాలి

గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు, అధికారులు, సిబ్బంది అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. గురువారం భద్రాచలంలో గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలతో ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, వైద్య శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు కూడా అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని కోరారు. మత్స్యకారులు, జాలర్లు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. భద్రాచలంలో ప్రస్తుతం కొనసాగుతున్న పునరావాస కేంద్రాలకు అదనంగా మరి కొన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, వరద సహాయక చర్యల ప్రత్యేకాధికారి అనుదీప్, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు.



బ్రిడ్జి వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్

బూర్గంపాడు: వరదలు తగ్గేంత వరకు అధికారులు తమకు కేటాయించిన స్థానాల్లోనే ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని మంత్రి అజయ్‌కుమార్ ఆదేశించారు. సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ.. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రహదారులపైకి, లో లెవల్ బ్రిడ్జిలపైకి వరద నీరు వస్తోందని, ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. అవసరమైన చోట రాకపోకలు నిలిపివేయాలన్నారు. రంగాపురం – పినపాక మధ్య కిన్నెరసాని బ్రిడ్జిపై పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు మెరుగైన వసతులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అత్యవసర సేవలకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను వినియోగించుకోవాలని, జిల్లాలోని పరిశ్రమల్లో ఉన్న రెస్క్యూ టీమ్‌లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎక్కడా ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా సమన్వయంతో పనిచేయాలన్నారు.

మకాం వేసిన కలెక్టర్, ఎస్పీ..

మరో రెండు రోజులు రెడ్ అలర్ట్ ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలతో పాటు గోదావరి పెరుగుతుండడంతో కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ వినీత్ భద్రాచలంలోనే మకాం వేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి 1.30 నిమిషాలకు కరకగూడెంలో పొంగిన వాగులను సందర్శించారు. ప్రత్యేకాధికారిగా నియమితులైన హైద్రాబాద్ కలెక్టర్ అనుదీప్ కూడా బుధవారం ఏజెన్సీలో తిరిగి ముంపు ప్రాంత ప్రజలను, అధికారులను అప్రమత్తం చేసి ఇక్కడే బస చేశారు. ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ సైతం సమీక్ష సమావేశాల్లో పాల్గొంటూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

దగా బంధు

- మొదలైన దళితబంధు దరఖాస్తుల స్వీకరణ
- గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్న ప్రక్రియ
- ముడుపులు ముట్టజెప్పిన వారితో జాబితా సిద్ధం
- విద్యాసంస్థల అధినేతల ఆధ్వర్యంలో 'కుట్ర'
- బీసీ బంధులోనూ ఇదే తరహా దందా

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: హైదరాబాద్‌కు చెందిన ఓ విద్యాసంస్థల అధిపతి జిల్లాపై అపరిమితమైన అనురాగం కురిపిస్తున్నారు. ముఖ్యంగా కొత్తగూడెం నియోజకవర్గంపై మరీ ఎక్కువ దృష్టి పెట్టారు. ఏపీలో మైనార్టీ ఇంజనీరింగ్ కాలేజీ నిర్వహిస్తున్న మరో విద్యావేత్త ఆయనకు అవసరమైన సహకారం అందిస్తున్నారు. వెరసి కోట్ల రూపాయల అవినీతి సొమ్ముతో తమ ఖజానా నింపుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో తమ జీవితాల్లో వెలుగు నింపుకుందామని ఆశపడుతున్న బలహీన వర్గాల వారి బతుకులను చీకటి చేసే కుట్రను దిగ్విజయంగా అమలు చేస్తున్నారు.

ఆర్థిక స్వావలంబనకు దళిత బంధు

అణగారిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా దళితులకు ఏకమొత్తంలో రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. దీంతో ఆయా కుటుంబాలు వ్యాపారాలు చేస్తూ ఆర్థిక స్వావలంబన సాధించాలనేది ప్రభుత్వ లక్ష్యం. లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను ఎమ్మెల్యేలకు కట్టబెట్టగా తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 మందిని ఎంపిక చేశారు. అయితే ఈ ఎంపికలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని రాష్ట్ర వ్యాప్తంగా ఆరోపణలు వచ్చాయి. దీంతో ఎమ్మెల్యేలతో పాటు కలెక్టర్, ఇతర అధికారులకు భాగస్వామ్యం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అనంతరం రెండో విడత దళితబంధుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నియోజకవర్గానికి 1,100 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే 500 మంది లబ్ధిదారులకు అందివ్వాల్సిన నిధులు మంజూరయ్యాయి.

సీఎం మాటంటే లెక్కలేదు..

మొదటిసారి దళితబంధు పథకంలో అవినీతి జరిగినట్టు ఆరోపణలు రావడంతో అవినీతిని సహించేది లేదంటూ సీఎం కేసీఆర్ తీవ్రస్వరంతో చెప్పారు. అయినప్పటికీ రెండో విడతలోనూ అవినీతి మరకలు అంటుకున్నాయి. దళితబంధు రెండో విడతకు సంబంధించి పూర్తి స్థాయిలో అనుమతులు రాకముందే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను అనధికారికంగా మొదలెట్టారు. ఏపీలో ఉన్న ఓ ఇంజనీరింగ్ కాలేజీలో గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యవహారం సాగినట్టు సమాచారం. దీనికి హైదరాబాద్‌లో భారీ స్థాయిలో విద్యాసంస్థలు నిర్వహిస్తున్న మరో పెద్దమనిషి నేతృత్వం వహించినట్టు తెలుస్తోంది. దళితబంధులో ఒక్కో యూనిట్‌ను రూ.2,00,000 వంతున బేరం పెట్టినట్టు సమాచారం. ఈ సొమ్ము ముట్టజెప్పిన వారి నుంచి అన్ని వివరాలు, సంబంధిత డాక్యుమెంట్లు తీసుకున్నట్టు తెలుస్తోంది.

గుట్టుగా కానిస్తున్నారు..

దళితబంధు రెండో విడత లబ్ధిదారుల ఎంపికలో జిల్లా యంత్రాంగం ఆది నుంచీ అంతులేని గోప్యత ప్రకటిస్తోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత ఎప్పుడు దరఖాస్తు చేసుకోవాలి ? ఎలా చేయాలి? ఎవరికి దరఖాస్తు చేసుకోవాలి? చివరి తేదీ ఏంటనే విషయాలను ఇప్పటికీ ఏ ఒక్క అధికారీ బహిర్గతం చేయలేదు. కానీ గత 15 రోజులుగా దళితబంధుకు సంబంధించిన దరఖాస్తులు అధికారులకు అందుతున్నాయి. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ అవుతున్నాయి. అయితే ఈ విషయాలేవీ బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. దీనికి కారణం విద్యాసంస్థల అధినేతల నుంచి ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు రావడమేనని తెలుస్తోంది. అంతేకాదు తమతో డీల్ కుదుర్చుకున్న వారి దరఖాస్తులకే ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. గత రెండు వారాలుగా ఈ వ్యవహారం జరుగుతోంది. కానీ మారిన పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల ఈ ప్రక్రియలో వేగం పెరిగింది. 500 మంది లబ్ధిదారులతో కూడిన తుది జాబితా సిద్ధమైంది, ఈ మొత్తం ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది.



బీసీ బంధులోనూ

దళిత బంధు రెండో విడతకు సంబంధించి ఎడ్యుకేషన్ మాఫియా తాము సిద్ధం చేసిన జాబితాను ఫైనల్ చేయించుకునే పనిలో ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.రెండు లక్షల వంతున ఇప్పటికే అందుకున్నారు. ఈ అవినీతి దందాలో రూ.10 కోట్ల వరకు చేతులు మారినట్టు తెలుస్తోంది. ఇదే తీరుగా బీసీ బంధులోనూ ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.20 వేలు ప్రతిఫలంగా తీసుకున్నట్టు సమాచారం. ఇక్కడ 200 మంది కంటే ఎక్కువగా లబ్ధిదారుల నుంచి డబ్బులు లాగినట్టు తెలిసింది. చివరకు డీఆర్‌డీఏ ద్వారా అందించే కుట్టుమిషన్ల లబ్ధిదారుల దగ్గర కూడా ఈ మాఫియా చేతులు చాచినట్టు ప్రచారం గుప్పుమంటోంది.

ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

బూర్గంపాడు: గోదావరి వరదల నేపథ్యంలో ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. ముంపు ప్రాంతాలను గురువారం ఆయన పరిశీలించారు. గోదావరి తీరంలోకి ఎవరినీ అనుమతించకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని పోలీసులకు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి రాములు, ఎస్సై సంతోష్, ఎంపీడీఓ వివేక్‌రామ్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అశ్వాపురం: వరదల నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. తుమ్మలచెరువులో పొంగి ప్రవహిస్తున్న లోతువాగును గురువారం ఆయన పరిశీలించారు. పొంగి పొర్లుతున్న వాగులను ఎవరూ దాటకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలను ముందే అంచనా వేసి లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండ్ల సంధ్యారాణి, ఎంపీటీసీ తాటి పూజిత, ఎంపీడీఓ వరప్రసాద్ పాల్గొన్నారు.



అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ప్రతీక్‌జైన్

అన్ని వసతులూ కల్పించాలి

కలెక్టర్ ప్రియాంక ఆల

బూర్గంపాడు/పాల్వంచరూరల్: ముంపు ప్రాంతాల ప్రజలను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించాలని, ఆయా కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. బూర్గంపాడు, నాగినేనిప్రోలులోని వరద ప్రభావిత ప్రాంతాలను గురువారం ఆమె పరిశీలించారు. ప్రస్తుతం వరద కొంత తగ్గినా శుక్రవారం ఉదయం వరకు పెరిగే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పునరావాస శిబిరాల్లో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఇక బుధవారం అర్ధరాత్రి కిన్నెరసాని ప్రాజెక్టు 12 గేట్లు ఎత్తడంతో వరద రోడ్డుపైకి వచ్చింది. దీంతో కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ వినీత్ తదితరులు రంగాపురం వద్ద గల బ్రిడ్జిని పరిశీలించారు. గురువారం ఉదయం కూడా వరద ఉధృతిని పరిశీలించారు. వాహనాలు నిలిపివేశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి అనుదీప్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీఓ రమాకాంత్, డీఎస్పీ వెంకటేష్, తహసీల్దార్లు భగవాన్‌రెడ్డి, రంగాప్రసాద్ పాల్గొన్నారు.



నాగినేనిప్రోలులో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సదరం క్యాంపునకు 64 మంది

చుంచుపల్లి: జిల్లాలోని దివ్యాంగుల కోసం గురువారం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన సదరం క్యాంపునకు 64 మంది హాజరయ్యారు. మొత్తం 70 మంది స్లాట్ బుక్ చేసుకోగా ఆరుగురు గైర్హాజరయ్యారు. హాజరైన పలువురికి వైద్యులు పుష్పలత తదితరులు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ కార్యాలయ సిబ్బంది యాదయ్య, ప్రదీప్, హాసిని తదితరులు పాల్గొన్నారు.



హాజరైన దివ్యాంగులు

విస్తారంగా వర్షాలు

- జిల్లాలో 59.9 శాతం అధిక వర్షపాతం నమోదు
- పొంగి పొర్లుతున్న ప్రాజెక్టులు
- రైతులను అప్రమత్తం చేస్తున్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వానాకాలం ప్రారంభంలో లోటు వర్షపాతంతో ఆందోళన కలిగించగా, ప్రస్తుతం 59.9 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ములకలపల్లిలో సాధారణ వర్షపాతం నమోదు కాగా, మిగిలిన అన్ని మండలాల్లోనూ వర్షాలు ఎక్కువగానే కురిశాయి. గురువారం ఒక్కరోజే జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వానలతో వర్షపాతం గణనీయంగా పెరిగింది. నిన్నటి వరకు లోటు వర్షపాతం ఉన్న కరకగూడెంలో 383.8 మి.మీ వర్షపాతం నమోదు కావడం విశేషం. అశ్వారావుపేటలో 51.6 మి.మీ, పినపాకలో 255.4, చర్లలో 217.2, దుమ్ముగూడెంలో 180.4, అశ్వాపురంలో 168.4, మణుగూరులో 172.6, ఆళ్లపల్లిలో 187.8, గుండాలలో 174.4, ఇల్లెందులో 159.4, టేకులపల్లిలో 140.4, జూలూరుపాడులో 164, చంద్రుగొండలో 111.4, అన్నపురెడ్డిపల్లిలో 112.6, చుంచుపల్లిలో 181.4, సుజాతనగర్‌లో 153.4, కొత్తగూడెంలో 216.4, లక్ష్మీదేవిపల్లిలో 185.8, పాల్వంచలో 195.6, బూర్గంపాడులో 138.4, భద్రాచలంలో 156.8, ములకలపల్లిలో 130.2, దమ్మపేటలో 59.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మొత్తంగా గురువారం జిల్లాలో 3,896.8 మి.మీ వర్షపాతం నమోదు కాగా 169.4 మి.మీ సరాసరి వర్షపాతం నమోదు కావడం విశేషం.



ఆళ్లపల్లి మండలం రాయిపాడు వద్ద కోతకు గురైన రోడ్డు

పొంగుతున్న వాగులు, ప్రాజెక్టులు

జిల్లాలోని తాలిపేరు, కిన్నెరసాని, సింగభూపాలెం తదితర ప్రాజెక్టుల్లో భారీగా వరద నీరు చేరడంతో పొంగిపొర్లుతున్నాయి. రహదారులు, చప్టాలపైకి నీరు చేరడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వర్షాల కారణంగా రోజువారీ కూలీలు పనులు లేక అవస్థలు పడుతున్నారు. వ్యాపారాలు సైతం మందగించగా, ప్రయాణికులు లేక ఆర్టీసీ బస్సులు సైతం వెలవెలబోయాయి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

అధికవర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ, ఉద్యాన, కేవీకే అధికారులు సూచించారు. మోటార్ల వద్దకు వెళ్లవద్దని, పంటచేలలో చేరిన నీటిని తొలగించాలని చెప్పారు. వర్షాలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు.

క్లుప్తంగా

జేకే ఓసీని సందర్శించిన డీడీఎంఎస్


జేకే ఓసీ వివరాలు తెలుసుకుంటున్న సనత్‌కుమార్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని జేకే ఓసీలో డీడీఎంఎస్(మైనింగ్) పి.సనత్‌కుమార్ పర్యటించారు. ఈసందర్భంగా ఆయన బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలు తెలుసుకున్నాక భద్రతాచర్యలపై సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో బి.వెంకటేశ్వర్లు, పూర్ణచందర్, చిన్నయ్య, శివప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి వైద్యులకు నియామకపత్రాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని ఆస్పత్రుల్లో వైద్యులుగా ఎంపికైన వారికి సింగరేణి జీఎం కె.బసవయ్య గురువారం నియామక పత్రాలు అందజేశారు. సింగరేణి ప్రధాన ఆస్పత్రితోపాటు ఇతర ఆస్పత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిన వైద్యుల నియామకానికి ఇటీవల ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈమేరకు ఎంపికైన 13మందికి కొత్తగూడెంలో నియామకపత్రాలు అందజేశాక జీఎం మాట్లాడారు. ఇప్పటికే ఆస్పత్రులను ఆధునికీకరించగా, వైద్యులను నియమించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు కె.శ్రీనివాసరావు, ధన్‌పాల్, పి.వేణుగోపాల్, జి.సుశీల, బి.గట్టుస్వామి, డి.నాగేశ్వరరావు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

దుప్పితోగులో గల్లంతైన యువకుడు మృతి

కరకగూడెం: మండల పరిధిలోని బంగారుగూడెం గ్రామంలో ఉన్న దుప్పితోగు వాగులో వరద ప్రవాహానికి ఆటో సహా బుధవారం రాత్రి గల్లంతైన కొడెం పాపారావు(23) మృతి చెందాడు. గురువారం గోవిందాపురం పెద వాగులో మృతదేహం లభ్యమైంది. చేతికొచ్చిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. విప్ రేగా వెంట ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో మహిళ...

అంబులెన్స్ రాక ఆటోలో తరలించేలోగా..

ములకలపల్లి: మండలంలోని గుర్రాలకుంటకు చెందిన తాటి లక్ష్మి(47) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. బుధవారం రాత్రి ఆమె ఆరోగ్యం విషమించడంతో కుటుంబీకులు 108కు సమాచారం ఇచ్చారు. అయితే, రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యాన రోడ్డు గుంతలమయమై అంబులెన్స్ వచ్చే వీలులేకుండా పోయింది. దీంతో ఆటోలో లక్ష్మిని పాల్వంచకు తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. రహదారి సక్రమంగా లేకపోవడంతోనే సకాలంలో వైద్యం అందక మృతి చెందిందని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: పెళ్లి చేసుకుని మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ కార్తీక్ కథనం ప్రకారం... తోగ్గూడేనికి చెందిన జేసీబీ డ్రైవర్ కీసరి ఏడుకొండలు తోగ్గూడెం క్యాంప్‌నకు చెందిన కులదీప్ సత్యను కొద్ది రోజుల క్రితం వివాహం చేసుకుని ఇంటికి తీసుకెళ్లాడు. కుటుంబ సభ్యులు వ్యతిరేకించడంతో ఆమెను పుట్టింటికి పంపించాడు. బాధితురాలి ఫిర్యాదుతో ఏడుకొండలుతోపాటు 8 మంది కుటుంబీకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కన్నీటి వరద


కోతకు గురైన గుండాల-సాయనపల్లి రహదారి

- వరదలతో తెగిపోయిన రహదారులు
- దెబ్బతింటున్న వంతెనలు
- జలమయంగా మారిన లోతట్టు ప్రాంతాలు

జిల్లాలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కిన్నెరసాని, తాలిపేరు తదితర ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. దీంతో గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేయగా, గ్రామాలు జలమయంగా మారాయి. రాకపోకలు స్తంభించాయి. ఏజెన్సీలోని అనేక పల్లెల్లో వరద ధాటికి రహదారులు కోతకు గురయ్యాయి. బ్రిడ్జిలు కూడా దెబ్బతిన్నాయి. గోదావరి పరీవాహక గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. ప్రజాప్రతినిధులు కేంద్రాలను, గ్రామాలను సందర్శించి బాధితులకు ధైర్యం చెప్పారు.

● రహదారుల కోత..


బంగారుగూడెం బ్రిడ్జి వద్ద కోతకు గురైన రహదారి

కరకగూడెం: వర్షాలు, వరదలకు మండలంలోని బంగారుగూడెం ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి ఇరువైపులా కోతకు గురైంది. కరకగూడెం-చిరుమళ్ల గ్రామాల మధ్య పెదవాగు బ్రిడ్జి ఒడ్డు కూడా ఇరువైపులా పూర్తిగా తెగిపోయింది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కలిగింది.


కరకగూడెం-చిరుమళ్ల మార్గంలో బ్రిడ్జి వద్ద పూర్తిగా తెగిపోయిన రోడ్డు

● అప్రమత్తంగా ఉండాలి

పినపాక: అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. గురువారం వరద ముంపు గ్రామాల్లో పర్యటించారు. పునరావాస కేంద్రాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఐలాపురం డబుల్ బెడ్ రూం ఇళ్ల గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు.

● కూలిన ఇళ్లు

మణుగూరు రూరల్ : వరదలతో పగిడేరు గ్రామ పంచాయతీలోని పలు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. రోడ్లు కోతకు గురై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలువురి ఇళ్లు కూలిపోయాయి. దీంతో బాధితులు తీవ్ర అవస్థ పడుతున్నారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, కూలిన ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.


పగిడేరులో కూలిన ఇల్లు

● పునరావాస కేంద్రాలకు ముంపు బాధితులు..

దుమ్ముగూడెం : వర్షాలు, వరదలతో ముంపునకు గురైన గ్రామాల ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. సున్నంబట్టి, ఎం.కాశీనగరం, గంగోలు డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఎల్‌ఎన్ రావు పేట, దుమ్ముగూడెం డబుల్ బెడ్‌రూం ఇళ్ల గ్రామస్తులను సీతానగరం, మాంగ్వాయిబాడ్వ, లక్ష్మీనగరం, మహాదేవపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తీసుకెళ్లారు. తహసీల్దార్ మణిధర్, ఎంపీడీఓ ముత్యాలరావు, సీఐ దోమల రమేష్, వైద్య సిబ్బంది సమన్వయంతో సేవలందిస్తున్నారు.


ఎల్‌ఎన్ రావుపేట గ్రామస్తులను పునరావాస కేంద్రానికి తరలిస్తున్న అధికారులు

భద్రాచలంలో..

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీ, అయ్యప్పకాలనీలకు చెందిన 185 మంది ముందు ముంపు బాధితులను డిగ్రీ కళాశాల, చర్ల రోడ్డులోని అభ్యుదయ భవన్ పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇప్పటికే అశోక్‌నగర్ కొత్తకాలనీకి చెందిన 201 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. వరద ఉధృతిని బట్టి పట్టణంలోని మిగిలిన ముంపు ప్రాంత బాధితులను తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

● 1986 తర్వాత మళ్లీ ఇప్పుడే..

పాల్వంచరూరల్: కిన్నెరసాని జలాశయానికి భారీగా వరద నీరు పోటెత్తింది. జలాశయం నిండుకుండలా మారింది. 1986లో మొదటిసారిగా కిన్నెరసానికి భారీగా వరద వస్తే మొత్తం గేట్లను ఎత్తి నీటిని వదిలారని ఎస్‌ఈ తెలిపారు. ఆ తర్వాత లక్షా 8 వేల క్యూసెక్కుల వరద రావడం ఇప్పుడేనని పేర్కొన్నారు. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్ నీటిమట్టం గురువారం 402.40 అడుగులుగా నమోదైంది. ఎగువ నుంచి మధ్యాహ్నం 1,08,000 క్యూసెక్కులు, సాయంత్రానికి కొంత 65,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్ట్ 12 గేట్లను ఎత్తి ఉంచి 1,01,000 క్యూసెక్కుల నీటినీ గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఎస్‌ఈ మొక్షంవీర్, ఈఈ వెంకట్‌రెడ్డి తెలిపారు. రాజాపురం, యానంబైల్ గ్రామాల మధ్య లోలెవల్ చప్టాపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఎగువన ఉన్న 24 గిరిజన గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పాండురంగాపురం, సూరారం, సోములగూడెం, రంగాపురం, నాగారం, సంగం, నారాయణరావుపేట గ్రామాల పరిధిలోని పంట పొలాలు, విద్యుత్ మోటార్లు నీట మునగడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.


కిన్నెరసాని ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో దిగువకు విడుదలవుతున్న వరద

ఇళ్లలోకి చేరిన వరద నీరు


నీటమునిగిన యానంబైల్ డంపింగ్‌యార్డు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలోకి వరదనీరు పోటెత్తడంతో జలాశయం 12 గేట్లను బుధవారం రాత్రి నుంచి ఎత్తి ఉంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కిన్నెరసాని, రాజాపురం గ్రామాల్లోని గడ్డం సందీప్, మజీద్, సైదులు ,రత్నాకర్, నాగభూషణం, తోట గంగులు, పుల్లమ్మ, చంద్రారెడ్డి తదితరుల నివాసాల్లోకి వరదనీరు వచ్చి చేరగా.. ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. రాజాపురం-యానంబైల్ చప్టా వద్ద ఉన్న వైకుంఠధామం, డంపింగ్‌యార్డు నీటమునిగాయి. వాగు సమీపంలోఉన్న యానంబైల్ స్కూల్ వెనుక భాగంలో భారీగా వరదనీరు చేరింది. చేపల చెరువు కూడా మునకకు గురైంది. జెన్‌కో అధికారులు సైరన్ ఇవ్వకుండా ఒక్కసారిగా గేట్లు ఎత్తడంతో ఇళ్లలోకి వరద వచ్చేవరకు తమకు తెలియలేదని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. కాగా కిన్నెరసాని గ్రామంలో ముంపునకు గురైన ఇళ్లను స్పెషల్ ఆఫీసర్ సీతారాములు నాయక్, ఎంపీడీఓ బి.అప్పారావు, ఎంపీఓ నారాయణ తదితరులు పరిశీలించారు.

● అధైర్య పడొద్దు.. ఆదుకుంటాం..

గుండాల: మండలంలోని పలు ముంపు గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రేగా కాంతారావు గురువారం పర్యటించి పరిశీలించారు. మల్లన్నవాగుపై నిర్మించిన హైలెవల్ బ్రిడ్జి, మొదుగులగూడెం-నడింగూడెం గ్రామాల మధ్య కిన్నెరసాని నది మీద నిర్మించిన బ్రిడ్జి, రాయిపాడు వద్ద లోలెవల్ కాజ్‌వే వరదల ధాటికి తెగిపోయాయి. ఆయా బ్రిడ్జిలను కాంతారావు సందర్శించి పరిశీలించారు. మామకన్ను, తూరుబాక, ముత్తాపురం, గుండాల, పడుగోనిగూడెం, మొదులగూడెం గ్రామాల్లో కూలిపోయిన ఇల్లు, నీటి మునిగిన పంటలను పరిశీలించారు. బ్రిడ్జిలకు మరమ్మతులు చేస్తామని, బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తెగిపోయిన రోడ్లు, బ్రిడ్జిలను ఇల్లెందు డీఎస్పీ ఎస్‌వీ రమణమూర్తి కూడా పరిశీలించారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.


ముత్తాపురంలో ఇల్లు కూలిపోయిన మహిళను ఓదారుస్తున్న విప్ కాంతారావు

● సమన్వయంతో పనిచేయాలి

భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య

దుమ్ముగూడెం : వరదల నేపథ్యంలో రెవెన్యూ, పంచాయతీ, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సీజనల్ వ్యాధులు బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆదేశించారు. మండలంలోని గోదావరి వరద ముంపునకు గురైన సున్నంబట్టి, ఎం.కాశీనగరం ప్రాంతాల్లో ఆయన గురువారం నాటు పడవపై తిరుగుతూ పరిశీలించారు. అనంతరం మాంగ్వాయిబాడ్వ ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. బాధితులకు అందుతున్న వసతులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు చింతిర్యాల రవికుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లంక శ్రీనివాసరావు, శివ, ఉబ్బ వేణు, కోడి చంటి, గుమ్మడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


నాటుపడవపై సున్నంబట్టి వెళ్తున్న ఎమ్మెల్యే వీరయ్య

ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం

భద్రాచలం: గోదావరి వరద ముంపు ప్రాంతాలైన భద్రాచలంలోని కొత్త కాలనీ, అయ్యప్ప నగర్, సుభాష్ నగర్ కాలనీలను ఎమ్మెల్యే పొదెం వీరయ్య గురువారం సందర్శించి బాధితులను పరామర్శించారు. కొత్తకాలనీలో ఇళ్లను వర్షపు నీరు చుట్టుముట్టడంతో ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు నుంచి అప్రమత్తం చేస్తున్నా పనిచేయని మోటార్లతో కాలయాపన చేయటం సరికాదన్నారు.

● అండగా ఉంటాం

ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

ములకలపల్లి: పాములేరులో గల్లంతైన మహిళ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. కుమ్మరిపాడు గ్రామానికి చెందిన కుంజా సీత వరినాటు వేసేందుకు వెళ్తొస్తున్న క్రమంలో పాములేరువాగు లోలెవల్ చప్టా దాటుతూ వరదలో గల్లంతైన విషయం విదితమే. ఈ క్రమంలో ఎమ్మెల్యే గురువారం ఘటనా ప్రదేశాన్ని సందర్శించి, వాగు ప్రవాహ ఉధృతిని పరిశీలించారు. బాధిత కుటుంబీకులతో మాట్లాడారు. రూ 15 వేల ఆర్థికసాయం అందజేశారు. రూ.3 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించామని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.


లోలెవల్ చప్టాపై ప్రవాహ ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా

అనంతరం సీతారాంపురం జీపీ పరిధిలో కోతకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్డును పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాసరావు, ఎస్సై సాయికిషోర్ రెడ్డి, సర్పంచ్‌లు కారం సుధీర్, సున్నం సుశీల, సుధాకర్, మండల ప్రత్యేకాధికారి బాలు, ఎంపీఓ లక్ష్మయ్య, ఏఈలు సుబ్బరాజు, లక్మానాయక్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

● ప్రారంభించి నెలరోజులే..

మణుగూరు రూరల్ : మండల పరిధిలోని కూనవరం గ్రామపంచాయతీ రైల్వేగేట్ సమీపంలో కోడిపుంజుల వాగుపై రూ.80 లక్షలతో నిర్మించిన వంతెన మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. ప్రారంభించి నెల రోజులు కూడా కాక ముందే.. వరద ఉధృతికి కొట్టుకుపోయింది. వంతెన నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, సింగరేణి సివిల్ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే వంతెన కొట్టుకుపోయిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా సింగరేణి అధికారులు వంతెన ప్రాంతానికి చేరుకుని వెంటనే మరమ్మతులు చేపట్టారు. నిర్మాణ పనులపై విచారణకు ఆదేశించినట్లు సమాచారం.


వరద ఉధృతికి కొట్టుకుపోయిన కోడిపుంజులవాగు వంతెన

● 20 అడుగులకు తుమ్మల చెరువు

అశ్వాపురం: కాకతీయుల కాలం నాటి, జిల్లాలోనే పెద్ద చెరువుల్లో ఒకటైన తుమ్మలచెరువు నీటిమట్టం గురువారం 20 అడుగులకు చేరింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు పొంగి వరద నీరు భారీగా వచ్చి చేరింది. రబీ సీజన్ పూర్తయ్యాక చెరువులో 10 అడుగుల మేర నీరు ఉంది. వర్షాకాలం ప్రారంభమయ్యాక ఒక్క అడుగు కూడా పెరగలేదు. ఈ చెరువు కింద 10 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. చెరువులో సరిపడా నీరు లేక ఖరీఫ్‌లో వరినాట్లు వేయాలా? వద్దా? అని రైతులు సందిగ్ధంలో ఉన్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు భారీగా వరద నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో మూడు అడుగులు నీరు చేరితే చెరువు అలుగు పోస్తోందని, ఆయకట్టులో రెండు పంటల ఢోకా ఉండదని చెబుతున్నారు.


తుమ్మలచెరువు నీటిమట్టం

మూడు గేట్లు.. ఆరు లీకేజీలు!


ప్రాజెక్ట్ నుంచి వృథాగా పోతున్న వరదనీరు

అశ్వారావుపేటరూరల్: సుమారు 16వేల ఎకరాలకు సాగునీరు అందించే అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లిలోని పెదవాగు ప్రాజెక్టు గేట్ల నుంచి మళ్లీ వరద కిందకు జారుతోంది. ప్రాజెక్టు మూడు గేట్లు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులకు ప్రభుత్వం గతేడాది జనవరిలో రూ.1.28కోట్లు మంజూరు చేసింది. మరమ్మతులు చేపట్టి గత నెల 15న బిగించగా, అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు ఇష్టారాజ్యంగా జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలకు బలం చేకూర్చేలా తాజాగా మూడు గేట్ల నుంచి మళ్లీ నీరు లీకేజీ అవుతోంది. రెండు గేట్ల నుంచి భారీగా, ఓ గేటు నుంచి స్వల్పంగా నీరు కిందకు వెళ్తోంది. అయితే, లీకేజీలు బయటపడకుండా అధికారులు ఏడు అడుగుల మేర వరదను దిగువకు విడుదల చేశారని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రాజెక్టు నీటి మట్టం 10అడుగులకు పడిపోగా సాగుకు ఇక్కట్లు ఎదురవుతాయని చెబుతున్నారు. ఈవిషయమై ప్రాజెక్టు ఏఈ కేఎస్‌బీ. కృష్ణను వివరణ కోరగా.. గేట్ల నుంచి లీకేజీ అవుతున్న మాట వాస్తవమేనని తెలిపారు. అయితే, పనులు పూర్తి కాలేదని, వర్షాలు తగ్గగానే పూర్తిస్థాయిలో పనులు చేయిస్తామని వెల్లడించారు.

జల దిగ్బంధంలో గుండాల


ఉధృతంగా పొంగుతున్న మల్లన్న వాగు

గుండాల: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గుండాల, ఆళ్లపల్లి మండలాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆయా మండలాల్లోని . కిన్నెరసాని, మల్లన్న వాగు, జల్లేరు, ఏడుమెలికల వాగు, మాడ్పెల వాగు ఉగ్రరూపం దాల్చాయి. పలుచోట్ల రోడ్లు కోతలకు గురయ్యాయ. పాడి పశువులు కొట్టుకుపోయాయి. స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. గుండాల, ఆళ్లపల్లి మండల కేంద్రాలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఊపిరి బిగపట్టుకుని రాత్రంతా భవనాలపై గడిపారు. గుండాల-పస్రా మధ్య మల్లన్న వాగు ఉధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. ఆళ్లపల్లి- కొత్తగూడెం మధ్య రాయిపాడు వద్ద, ఆళ్లపల్లి-లక్ష్మీపురం మధ్య రోడ్లు కోతకు గురయ్యాయి. పలు గ్రామాల్లో పాడి పశువులు కొట్టుకుపోయాయి. ఆళ్లపల్లి మండలం చంద్రాపురం వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పిల్లర్లు కుంగిపోయాయి.

ముంపునకు గురైన గ్రామాలు

భారీ వర్షానికి గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో పలు గ్రామాలు ముంపునకు గురయ్యాయి. గుండాల మండలంలో సాయనపల్లి, ముత్తాపురం, పడుగోనిగూడెం, తూరుబాక ఎస్సీ కాలని, కోనవారిగూడెం, ఆళ్లపల్లి మండలంలో రామచంద్రయ్య గుంపు, రాయిపాడు, అనంతోగు గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి. ఇళ్లలో ఉన్న పత్తి, ఎరువులు, విత్తనాలు తడిసి ముద్దయ్యాయి. రాత్రి ఒక్కసారిగా వచ్చి కిన్నెరసాని వరదతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఊరిబయటకు పరుగులు పెట్టారు. గురువారం అధికారులు అప్రమత్తమై నీట మునిగిన ఇళ్లలో ఉన్న బాధితులను బయటకు తీసుకొచ్చారు.



ఆళ్లపల్లి: నీట మునిగిన రాయిపాడు గ్రామం, చంద్రాపురంలో కుంగిన జల్లేరు వాగు బ్రిడ్జి నిర్మాణ పిల్లర్లు

ముంపు తగ్గేవరకూ శిబిరాల్లోనే ఉండాలి

అశ్వాపురం: వరద పూర్తిగా తగ్గి సాధారణ పరిస్థితి వచ్చేంతవరకు ముంపు బాధితులు పునరావాస శిబిరాల్లోనే ఉండాలని వరద సహాయక చర్యల ప్రత్యేకాధికారి అనుదీప్ అన్నారు. మండల పరిధిలోని మిట్టగూడెం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. అక్కడి ప్రజలతో మాట్లాడి ఏర్పాట్లు, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. శిబిరంలో అన్ని అసౌకర్యాలు కల్పించాలని, నాణ్యమైన ఆహారం, సురక్షిత తాగు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాజు, వ్యవసాయ శాఖ ఏడీ తాతారావు, ఆర్‌ఐ రాజేశ్వరరావు పాల్గొన్నారు.


ముంపు బాధితులతో మాట్లాడుతున్న అనుదీప్

తాలిపేరుకు తగ్గిన వరద

చర్ల: తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్‌కు వరద ఉధృతి క్రమేపీ తగ్గుతోంది. బుధవారం ప్రాజెక్ట్ 25 గేట్లను పూర్తిగా ఎత్తి ఉంచి 1,98,592 క్యూసెక్కుల వరదనీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. గురువారం రాత్రి 7 గంటలకు 25 గేట్లను ఎత్తి ఉంచి 32,014 క్యూసెక్కుల వరదనీరు మాత్రమే విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 70.30 మీటర్ల నీరు నిల్వ ఉంది.

